# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 128 ఆదివారం 11, జనవరి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## మహిళా ఐఏఎస్‌పై తప్పుడు ప్రచారం తగదు

### కొన్ని మీడియా సంస్థలు పోటీ పడుతున్నాయి

నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత హననం సరికాదు

బదిలీల్లో మంత్రులు, ఎమ్మెల్యేల జోక్యం ఉండదు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మంత్రులపై, అధికారులపై ఇటీవల వస్తున్న ఆరోపణలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా ఓ మహిళా ఐఏఎస్ అధికారిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దుష్ప్రచారం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నిరాధార ఆరోపణలు వ్యక్తిగత జీవితాలను, కుటుంబాలను మానసికంగా వేధించే స్థాయికి చేరుతున్నాయని అన్నారు.
హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...

..మిగతా 2లో



## ఆల్మంట్ కిడ్ సిరప్ వాడొద్దు

**తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాలు**

**ఈ సిరప్‌లో ఇథలీన్ గ్లైకాల్ ఉంది**

**పిల్లలకు ఈ సిరప్ విషపూరితం**


**ఈ సిరప్ ఎక్కడున్నా విక్రయం ఆపాలి**

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి: డీసీఏ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

పిల్లలకు వాడే 'ఆల్మంట్ కిడ్ సిరప్' వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (TG DCA) ఆదేశాలు జారీ చేసింది. ఈ సిరప్‌లో ఇథలీన్ గ్లైకాల్ కలుషితం ఉన్నట్లు గుర్తించడంతో ఇది విషపూరితమైనదిగా

..మిగతా 2లో





# పట్నం వదిలి పల్లెకు

### పండగకు సొంతూళ్లకు వెళ్తున్న జనం

**ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిట**

**జాతీయ రహదారులపై విపరీతమైన రద్దీ**

**కార్లు, బస్సులతో నిండిపోయిన హైవే**

**వాహనాలు ముందుకు కదలక జనం ఇబ్బందులు**

**హైదరాబాద్ నగరంలోనూ అప్పుడే పండగా వాతావరణం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

సంక్రాంతి పండగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీ వాహన రద్దీ నెలకొంది. శనివారం ఉదయం నుంచే హైవే పొడవునా వాహనాలు బారులు తీరాయి. నగరం నుంచి జిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు బయల్దేరుతున్న వారి సంఖ్య ఒక్కసారిగా పెరగడంతో ట్రాఫిక్ పూర్తిగా కుదేలైంది. ముఖ్యంగా చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. కొన్ని చోట్ల వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.
శుక్రవారం రాత్రి నుంచే రద్దీ ప్రారంభమైనప్పటికీ, శనివారం ఉదయం అది పీక్ స్థాయికి చేరింది. కార్లు, బస్సులు, లారీలతో

..మిగతా 2లో

## నేను వైద్యుడిని కాదు.. కానీ, సోషల్ డాక్టర్‌ను

**హైదరాబాద్‌లో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు**

**తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే సోషల్ డాక్టర్‌ని అన్న సీఎం**

**ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని వెల్లడి**




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలామంది ప్రాణాలు కాపాడవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే సోషల్ డాక్టర్‌నని అన్నారు.
ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని

..మిగతా 2లో

## మియాపూర్ లో హైడ్రా భారీ ఆపరేషన్

**రూ.3 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**

**మహబూబ్ పేట గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 44లో ప్రభుత్వ భూమి ఆక్రమణ**

**చెరువుకట్టపై కూడా అక్రమ నిర్మాణాలు**

**తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసిన అక్రమార్కులు**



03

## మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు

**మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో కథనం**

**వాస్తవాలకు దూరంగా వార్తలు వస్తున్నాయన్న మహేశ్ గౌడ్**

**నిరాధార వార్తలు ప్రచురించడం మానేయాలని హితవు**



02

## పెరిగిన ధరలకు నాకు సంబంధం లేదు..!

సినిమా టికెట్ ధరల పెంపుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

టికెట్ ధరల పెంపుతో తనకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి స్పష్టం

పుష్ప2 తర్వాత నా దగ్గరికి టికెట్ రేట్ల విషయం ఎవరూ రావద్దని చెప్పా..



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

చాలా రోజుల తర్వాత హీరో ప్రభాస్ ను వెండితెరపై చూడడానికి అభిమానులు ఎగబడ్డారు. ఇది ఇలా ఉండగా.. సినిమా టికెట్ ధరలకు సంబంధించి అనేక విషయాలు ఇప్పుడు తెగ హాట్ టాపిక్ గా

..మిగతా 2లో

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన..

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తామని జనసేన ప్రకటన**

**పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా జనసేన నిర్ణయం**

**సాధ్యమైనన్ని స్థానాల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటన**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమని జనసేన పార్టీ అధికారికంగా ప్రకటించింది. శనివారం ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి రామ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ, రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ, తెలంగాణలోని సాధ్యమైనన్ని మున్సిపల్

..మిగతా 2లో

## ఢిల్లీ వేదికగా భట్టి గర్జన.. కేంద్రానికి షాకిచ్చే డిమాండ్లు..!

**ఢిల్లీలో భట్టి డిమాండ్లు**

**'తెలంగాణ 2047' లక్ష్యం**

**కీలక ప్రాజెక్టుల విన్నపం**

**సెస్‌లపై కేంద్రంపై నిలదీత**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు కోరారు. శనివారం నాడు న్యూఢిల్లీలోని అశోకా హోటల్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 'ప్రిబడ్జెట్' సమావేశంలో ఆయన పాల్గొని తెలంగాణ ప్రభుత్వ విన్నపాలను కేంద్రం ముందుంచారు. 2047 నాటికి దేశాన్ని

..మిగతా 2లో





www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

## పెరిగిన ధరలకు నాకు సంబంధం లేదు..!

మొదటిపేజీ తరువాయి



మారాయి. ఆంధ్రప్రదేశ్ లో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకపోయినా.. తెలంగాణలో మాత్రం సినిమా ధరలతో సంబంధించి గవర్నమెంట్ ఆర్డర్ రావడం కాస్త ఆలస్యం అయ్యింది. అయితే అన్ని అడ్డంకులు ఎదుర్కొని చివరకు శుక్రవారం తెల్లవారుజామున 12 తర్వాత ప్రీమియర్ షోలు పడ్డాయి. ఇది ఇలా ఉండగా..

ప్రభాస్ నటించిన "ది రాజాసాబ్" సినిమా టికెట్ల ధరల పెంపునకు అనుమతినిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డర్ ను శుక్రవారం తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఈ అనుమతులు ఇచ్చారని న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

అలాగే మీరు తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదిని కోర్టు ప్రశ్నించింది. మంత్రులు స్వయంగా ధరలు పెంచమని చెబుతుంటే, వెనుక నుంచి ఇలాంటి మెమోలు ఎలా వస్తున్నాయని మండిపడింది. ఈ గందరగోళం మధ్య సినిమా ఇండస్ట్రీ వ్యవహారాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. టికెట్ల ధరల పెంపుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తేల్చి చెప్పారు.


పుష్ప2 సినిమా తర్వాత నా దగ్గరికి టికెట్ రేట్లు పెంచాలని ఎవ్వరూ రావద్దని ముందే చెప్పాను. అలాగే అఖండ 2 సమయంలో కూడా ఇలాగే జరిగింది. అయితే ఇప్పుడు నన్ను ఎవరూ కలవడం లేదు. పెరిగిన ధరలకు, నాకు ఎటువంటి సంబంధం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇంకా పుష్ప2 సినిమా విడుదల సమయంలో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. ఆ ఘటనకు పర్మిషన్ ఇచ్చినందుకు తాను చాలా బాధపడ్డానని, ఇంకా గాయపడిన వారి బాబు ట్రీట్‌మెంట్ కోసం తన సొంత డబ్బులు కూడా ఇచ్చానని, ఆ చేదు అనుభవం వల్లే ఇకపై సినిమా ఇండస్ట్రీ గోలకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్లు మంత్రి అన్నారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన..

మొదటిపేజీ తరువాయి

స్థానాల్లో జనసేన అభ్యర్థులను బరిలోకి దించుతామని పార్టీ స్పష్టం చేసింది. ఇందుకోసం పార్టీ ఇప్పటికే తన కార్యచరణను ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న జనసైనికులు, వీరమహిళలు ఈ ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పార్టీ పిలుపునిచ్చింది.

ఈ ఎన్నికల ద్వారా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను, ఆయన భావజాలాన్ని తెలంగాణలోని ప్రతి ఇంటికీ చేరవేయడమే ప్రధాన ఉద్దేశ్యమని జనసేన వెల్లడించింది. పవన్ కళ్యాణ్ కి తెలంగాణ ప్రాంతం పట్ల ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని ప్రజలకు వివరించి, రాష్ట్రంలో ఒక సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే ఈ పోటీ వెనుక ఉన్న అసలు లక్ష్యమని పార్టీ తన ప్రకటనలో వివరించింది. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన ఎంట్రీ ఇవ్వడంతో తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారనున్నాయి.



## ఆల్మంట్ కిడ్ సిరప్ వాడొద్దు

మొదటిపేజీ తరువాయి

నిర్ధారించారు. ఈ మేరకు కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (CDSCO) నుంచి రాష్ట్ర అధికారులకు హెచ్చరిక అందింది.

CDSCO నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టిన తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అధికారులు... ఈ సిరప్ ఎక్కడైనా నిల్వలో ఉంటే వెంటనే వినియోగం, విక్రయాలను ఆపాలని ఔషధ వ్యాపారులకు, మెడికల్ షాపులకు స్పష్టంగా సూచించారు. ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న స్టాక్‌ను ఉపసంహరించుకోవాలని, సంబంధిత బ్యాచ్ వివరాలను అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

ఇథలీన్ గ్లైకాల్ కలుషితం ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదకరమని, ముఖ్యంగా పిల్లల్లో మూత్రపిండాల సమస్యలు, నరాల సంబంధిత దుష్ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. గతంలోనూ ఈ రసాయనంతో కలుషితమైన సిరప్‌ల కారణంగా దేశవ్యాప్తంగా అనేక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యం ఉందని గుర్తు చేశారు. పిల్లలకు ఉపయోగించే ఔషధం కావడంతో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సూచించింది. ఎవరి వద్దైనా 'ఆల్మంట్ కిడ్ సిరప్' ఉంటే వెంటనే వాడకాన్ని నిలిపివేసి, సమీపంలోని డ్రగ్ కంట్రోల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజారోగ్య భద్రతే ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.



# పట్నం వదిలి పల్లెకు

మొదటిపేజీ తరువాయి

హైవే నిండిపోయింది. పండగకు ముందు రోజు కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, కుటుంబాలతో ప్రయాణించే వారు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. దీని ప్రభావంతో సాధారణంగా గంటలో పూర్తయ్యే ప్రయాణం రెండు నుంచి మూడు గంటల వరకు సాగుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు.

టోల్ ప్లాజాల వద్ద ఎక్కువ సమయం తీసుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజాల వద్ద లైన్లు కదలకపోవడంతో కొందరు వాహనదారులు టోల్ నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు, నేషనల్ హైవే అధికారులు రంగంలోకి దిగారు. అదనపు సిబ్బందిని మోహరించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా, ట్రాఫిక్ పోలీస్ అధికారులు వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వారు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని సూచించారు. అలాగే గుంటూరు, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నాగార్జున సాగర్ హైవే మీదుగా ప్రయాణించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో రద్దీ తక్కువగా ఉంటుందని, ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని పోలీసులు పేర్కొన్నారు.

హైవే రద్దీతో పాటు హైదరాబాద్ నగరంలోనూ సంక్రాంతి సందడి స్పష్టంగా కనిపిస్తోంది. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్ బస్‌స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. శనివారం ఉదయం నుంచే బస్టాండ్‌లన్నీ కిటకిటలాడుతున్నాయి. టికెట్లు దొరకక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లాలకు వెళ్లే బస్సుల్లో సీట్లు పూర్తిగా నిండిపోయాయి.

ఎంజీబీఎస్, జేబీఎస్‌లతో పాటు దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక వంటి కీలక కూడళ్లలో కూడా ప్రయాణికుల సందడి నెలకొంది. ఈ ప్రాంతాలన్నీ పండగకు వెళ్లే వారితో నిండిపోయాయి. ఆటోస్టాండ్లు, క్యాబ్ పాయింట్ల వద్ద కూడా రద్దీ పెరిగింది. కొన్ని చోట్ల ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. సాధారణ సర్వీసులతో పాటు అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, జిల్లా కేంద్రాలకు ప్రత్యేకంగా బస్సులను అందుబాటులో ఉంచామని చెప్పారు. పండగ ముగిసే వరకు ఈ ప్రత్యేక సర్వీసులు కొనసాగుతాయని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.

మరోవైపు రైల్వే స్టేషన్లలో కూడా సంక్రాంతి రద్దీ కనిపిస్తోంది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి



రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు భారీగా తరలివస్తున్నారు. ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాల్స్ నిండిపోయాయి. పలు ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు పూర్తిగా రిజర్వేషన్‌తో నిండిపోయినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సాధారణ బోగీల్లో కూడా నిల్చునే స్థలం లేకుండా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

రైల్వే శాఖ కూడా పండగ రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కొన్ని మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. అదనపు బోగీలను కూడా జోడించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భద్రత దృష్ట్యా రైల్వే స్టేషన్లలో అదనపు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఇదిలా ఉండగా, నగరం నుంచి బయటకు వెళ్లే మార్గాల్లో రద్దీ మరికొన్ని రోజులు కొనసాగుతుందని ట్రాఫిక్ పోలీసులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం, పండగ ముందు రోజు రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రయాణికులు ఓర్పుతో వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. అనవసరంగా హైవే మధ్యలో వాహనాలు ఆపకుండా, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మొత్తంగా సంక్రాంతి పండగ సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరగడంతో రహదారులు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు అన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పండగ ముగిసే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు భావిస్తున్నారు.

## మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు

- **మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో కథనం**
- **వాస్తవాలకు దూరంగా వార్తలు వస్తున్నాయన్న మహేశ్ గౌడ్**
- **నిరాధార వార్తలు ప్రచురించడం మానేయాలని హితవు**



హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణకు చెందిన ఓ మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో ప్రసారమైన కథనం సంచలనం రేకెత్తించింది. ఈ కథనంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండించారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని, వాస్తవాలకు దూరంగా ఇలాంటి వార్తలు వస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి మంత్రులు, అధికారులు ఈ స్థాయికి చేరుకుంటారని, అలాంటి వారిపై నిరాధారమైన వార్తలు ప్రచురించడం మానేయాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మహేశ్ కుమార్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

అంతేకాకుండా, శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నిస్తూ, రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని, ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మేము రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమయ్యారని, కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్ రావు బాధపడుతున్నారని అన్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారని పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు సాధించామని, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించామని... మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోందని అన్నారు.

## మహిళా ఐఏఎస్‌పై తప్పుడు ప్రచారం తగదు

మొదటిపేజీ తరువాయి

పరిపాలనా వ్యవస్థలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టర్ల బదిలీలు జరిగినట్లు తెలిపారు. ఇవి ప్రభుత్వ విధానాలు, అవసరాల మేరకు జరిగే ప్రక్రియలేనని, ఈ బదిలీల విషయంలో చాలా సందర్భాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా ఎలాంటి జోక్యం ఉండదని స్పష్టం చేశారు. అయినప్పటికీ రాజకీయ నాయకులే అధికారుల బదిలీలకు కారణమన్నట్లు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. తన జిల్లాతో పాటు అనేక జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్న మంత్రి, అధికారుల పనితీరుపై ఆధారపడి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. అటువంటి పరిపాలనా నిర్ణయాలను వక్రీకరిస్తూ అధికారులపై అభాండాలు వేయడం తగదని సూచించారు. ముఖ్యంగా మహిళా అధికారులను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత స్థాయికి దిగజారేలా ప్రచారం చేయడం అత్యంత బాధాకరమన్నారు.

రేటింగ్‌లు, వ్యూస్ కోసం కొందరు మీడియా సంస్థలు, సోషల్ మీడియా వేదికలు అవాస్తవ కథనాలు ప్రచారం చేస్తున్నాయని కోమటిరెడ్డి విమర్శించారు. ఛానళ్ల మధ్య పోటీ కారణంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల మహిళా అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇది కేవలం అధికారులకే కాదు, వారి కుటుంబాలకు కూడా తీవ్ర మానసిక వేదన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు స్థానం ఉందని అంగీకరిస్తూనే... అవి ఆధారాలతో, బాధ్యతతో ఉండాలని మంత్రి సూచించారు. నిజానిజాలు తెలుసుకోకుండా, వదంతులు, ఊహాగానాలతో కథనాలు ప్రచారం చేయడం సమాజానికి ప్రమాదకరమన్నారు. మంత్రులపై మాత్రమే కాకుండా ముఖ్యమంత్రి మీద కూడా ఇటువంటి దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపించారు.

ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని, పరిపాలనలో ఎలాంటి అనుచితాలకు తావు లేదని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో అనవసర అనుమానాలు సృష్టించే రాతలను మీడియా నివారించాలని, బాధ్యతాయుతమైన జర్నలిజం పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత జీవితాలను కించపరచే కథనాలకు దూరంగా ఉండాలని, వాస్తవాల ఆధారంగా మాత్రమే వార్తలు రాయాలని మంత్రి సూచించారు.

## ఢిల్లీ వేదికగా భట్టి గర్జన.. కేంద్రానికి షాకిచ్చే డిమాండ్లు.!

మొదటిపేజీ తరువాయి




30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని, అందుకు అనుగుణంగా రాష్ట్ర మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతంగా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ద్వారా దీనిని 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇందుకు రాష్ట్రాల ద్రవ్య లోటు (Fiscal Deficit) పరిమితిని ప్రస్తుతం ఉన్నదానికంటే 4 శాతానికి పెంచాలని ఆయన కేంద్రానికి సూచించారు. అలాగే, విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను FRBM పరిమితుల నుండి మినహాయించాలని కోరారు.


రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని భట్టి విక్రమార్క కోరారు. అందులో ముఖ్యమైనవి.. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల: ఈ పథకాన్ని వెంటనే 'జాతీయ ప్రాజెక్టు'గా గుర్తించి నిధులు కేటాయించాలి. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 కు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని, ప్రాంతీయ రింగ్ రోడ్ (RRR) ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ. 14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ. 45,000 కోట్లు, , మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ. 17,212 కోట్లు కేటాయించాలని విన్నవించారు.

తెలంగాణలో విద్యారంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ.. 119 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను' ఆయన ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఐఐఎం (IIM) ఏర్పాటును ప్రకటించాలని, అలాగే అన్ని జిల్లాల్లో కేంద్రీయ , జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కోరారు. రవాణా పరంగా పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం ప్రాంతాల్లో నూతన విమానాశ్రయాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర పన్నుల పంపిణీలో రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని భట్టి విక్రమార్క ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. సెస్‌లు, సర్‌ఛార్జీల వల్ల రాష్ట్రాలకు అందాల్సిన 41 శాతం వాటా కాస్తా 30 శాతానికే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ. 1.55 లక్షల కోట్ల సర్‌ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలని లేదా వాటిని ప్రాథమిక పన్నుల్లో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకుంటున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని ఆయన కోరారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం తెలంగాణ అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తుందని ఆశిస్తున్నట్లు భట్టి విక్రమార్క తన ప్రసంగాన్ని ముగించారు.

## నేను వైద్యుడిని కాదు.. కానీ, సోషల్ డాక్టర్‌ను

మొదటిపేజీ తరువాయి



ఆయన అన్నారు. ప్రభుత్వ పాలసీలను మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఇందుకోసం వైద్యులు సూచనలు ఇవ్వాలని కోరారు. వైద్యులు ప్రజలు, సమాజంపై తమ బాధ్యతను ఎప్పుడూ మరిచిపోకూడదని అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని, అదే సమయంలో ప్రజల నాడిని పట్టుకోవడం మరిచిపోవద్దని సూచించారు.

గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఆరోగ్య రంగంలో ఆవిష్కరణల్లో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని ముఖ్యమంత్రి అన్నారు.




## క్రీడలు ఐక్యతను పెంచుతాయి.

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.
- హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి.
- ఎస్సై జలంధర్ రెడ్డి.

**పెద్దమందడి,జనవరి 10(ప్రజాస్వరం):**

క్రీడలు మనుషుల మధ్య ఐక్యతను పెంచుతాయని పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డి అన్నారు. మండలంలోని జగత్ పల్లి గ్రామంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని జగత్ పల్లి ప్రీమియర్ లీగ్ పేరిట నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను స్థానిక సర్పంచ్ పెంటన్న యాదవ్ తో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ బంతిని విసరగా ఎస్సై బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత మద్యానికి బానిస కాకుండా తల్లిదండ్రుల ఆశయ సాధనకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. పండగలు, ప్రత్యేక రోజులను పురస్కరించుకొని క్రీడలు నిర్వహించడం శుభ పరిణామమని అన్నారు. క్రీడల వల్ల ఐక్యతతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం ఏర్పడతాయని చెప్పారు. క్రీడా ప్రాంగణాలలో స్వాగత ఫ్లెక్సీల కంటే హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, ధూమపానం, మద్యపానం సేవించి వాహనాలు నడపవద్దు అంటూ ఫ్లెక్సీలు పెట్టాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉన్నత చదువులు చదువుకొని జీవిత ఆశయాలను నెరవేర్చాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, గ్రామాల్లో గొడవలు సృష్టించే వారి పట్ల తాను కఠినంగా ఉంటానని, ఎంతటి పెద్దవారితో చెప్పించినా వినే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆ తర్వాత జగత్ పల్లి ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు ఎస్ఐ యుగంధర్ రెడ్డి, సర్పంచ్ పెంటన్న యాదవ్ తో పాటు గ్రామస్తులకు శాలువాలు కప్పి ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటన్న యాదవ్, మణిగిల్ల సర్పంచ్ పనస శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు శ్రీనివాస యాదవ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మన్యంకొండ యాదవ్, బి. చంద్రయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ నాయుడు, భాస్కర్ యాదవ్,రాజు యాదవ్, రాములు యాదవ్,బి. విష్ణు, గౌనికాడి వెంకటేష్ యాదవ్, జానంపేట తిరుపతి నాయుడు, నిర్వాహకులు శివ యాదవ్,ధోని, బాలరాజు,వెంకటేష్ సాగర్,ప్రవీణ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.





# మియాపూర్ లో హైడ్రా భారీ ఆపరేషన్

- మియాపూర్ లో హైడ్రా భారీ ఆపరేషన్
- రూ.3 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- మహబూబ్ పేట గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 44లో ప్రభుత్వ భూమి ఆక్రమణ
- చెరువుకట్టపై కూడా అక్రమ నిర్మాణాలు
- తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసిన అక్రమార్కులు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ ప్రాంతంలో హైడ్రా (HYDRA) అధికారులు భారీ స్థాయిలో ఆపరేషన్ నిర్వహించారు. అక్రమార్కుల చెరలో చిక్కుకున్న ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చేపట్టిన ఈ చర్యల్లో రూ.3 వేల కోట్లకు పైగా విలువ చేసే భూమిని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ భూములపై కన్నేసిన భూకబ్జా దారులకు ఇది గట్టి హెచ్చరికగా మారింది.

మక్తా మహబూబ్ పేట గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 44లో ఉన్న ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు అందడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఈ సర్వే నెంబర్లో మొత్తం 43 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని తమదిగా చూపించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు విచారణలో తేలింది.

సర్వే నెంబర్ 159కు సంబంధించిన భూమి పత్రాలను ఉపయోగించి, సర్వే నెంబర్ 44లోని ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేసినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఇమ్రాన్ అనే వ్యక్తి ఇప్పటికే సుమారు ఎకరన్నర భూమిని కబ్జా చేసినట్లు నిర్ధారణకు వచ్చింది. అక్రమంగా భూమిని ఆక్రమించినందుకు సంబంధిత వ్యక్తి పై కేసు నమోదు చేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

ఇమ్రాన్ కబ్జా చేసిన భూమితో పాటు, అదే ప్రాంతంలో మరో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా అధికారులు అక్రమార్కుల చెర నుంచి విడిపించారు. అక్రమ నిర్మాణాలు, మట్టితో నింపిన ప్రాంతాలను తొలగించి భూమిని పూర్తిగా ఖాళీ చేయించారు. ప్రభుత్వ భూమిపై ఎలాంటి ప్రైవేట్ హక్కులు ఉండవని, భవిష్యత్తులోనూ ఎవరు ఆక్రమించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

మియాపూర్ - బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా చెరువు కట్టపై అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు కూడా ఈ ఆపరేషన్‌లో తొలగించబడ్డాయి. చెరువు కట్టపై సుమారు 200 మీటర్ల మేర మట్టి పోసి, 18 షెట్టర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇవన్నీ ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏర్పాటు చేసినవేనని నిర్ధారించి, హైడ్రా సిబ్బంది వాటిని పూర్తిగా కూల్చివేశారు. చెరువులు, వాటి పరిధుల్లో జరుగుతున్న అక్రమాలపై ఇకపై సహించేది లేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ఫిర్యాదు అందిన వెంటనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేపట్టారు. సర్వే నెంబర్ 44లోని భూమికి సంబంధించిన పాత రికార్డులు, రెవెన్యూ పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలను సవివరంగా పరిశీలించారు. ముఖ్యంగా అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లపై లోతైన దర్యాప్తు నిర్వహించారు.



విచారణలో ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపిస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, కొందరు దళారులు భూమిని అమ్మకాలకు సిద్ధం చేసినట్లు అధికారులు గుర్తించారు. భూమి విలువ వేల కోట్ల రూపాయలకు చేరడంతో కబ్జా దారుల కన్ను ఈ ప్రభుత్వ భూమిపై పడిందని హైడ్రా అధికారులు నిర్ధారించారు. భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు.

సమగ్ర విచారణ అనంతరం మక్తా మహబూబ్ పేటలోని సర్వే నెంబర్ 44లోని మొత్తం ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టంగా తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఇకపై ఎవరూ ఈ భూమిని ఆక్రమించకుండా శాశ్వత చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణలో హైడ్రా ఎలాంటి రాజీ పడదని అధికారులు స్పష్టం చేశారు. అక్రమంగా భూములు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అవసరమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పుడు పత్రాలు సృష్టించడం, నకిలీ రిజిస్ట్రేషన్లు చేయడం వంటి అక్రమాలకు పాల్పడితే చట్టం ముందు తప్పించుకునే అవకాశం లేదని చెప్పారు.

మియాపూర్ పరిసర ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి జరుగుతుండటంతో ప్రభుత్వ భూములపై భూకబ్జాదారుల దృష్టి పడుతోందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, చెరువులు, ప్రభుత్వ ఖాళీ భూములు లక్ష్యంగా అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, అక్రమాలను గుర్తించి తొలగించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రజలు కూడా ప్రభుత్వ భూములపై జరిగే అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా కబ్జా ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే హైడ్రా అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

మొత్తంగా మియాపూర్‌లో జరిగిన ఈ హైడ్రా ఆపరేషన్ ప్రభుత్వ భూముల పరిరక్షణలో కీలక మైలురాయిగా నిలిచింది. వేల కోట్ల విలువ చేసే భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించి ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవడం ద్వారా భూకబ్జా దారులకు స్పష్టమైన హెచ్చరిక ఇచ్చినట్లయింది. భవిష్యత్తులోనూ ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హైడ్రా అధికారులు మరోసారి స్పష్టం చేశారు.




## "సమ్మక్క.. సారలమ్మ" ని దర్శించుకున్న మాజీ జడ్పీటీసీ కుటుంబం

- ఆలయ గౌరవ మర్యాదలు, సంస్కృతుల ప్రకారం..మేళ తాళాలు తో స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు.

**బూర్గంపాడు,జనవరి 10 (ప్రజాస్వరం):**

మన తెలంగాణా ప్రత్యేక గిరిజన సంస్కృతి తెలియజేసే మేడారం మహా జాతర జనవరి 28 నుండి 31 వరకు జరగనుంది.ఈ జాతరకు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రతేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్న బూర్గంపహాడ్ మండల మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత రామకొండారెడ్డి దంపతులు, వారి కుమార్తెలు కామిరెడ్డి మహాలక్ష్మి,కామిరెడ్డి మైథిలి,వారితో పాటు పోతురెడ్డి గోవింద రెడ్డి నాగమణి కుటుంబం, బిజ్జం శ్రీకాంత్ రెడ్డి ప్రసన్న కుటుంబం మరియు బంధుమిత్రులు పాలొన్నారు.





## ప్రభుత్వ హై స్కూల్ లో నిర్వహించిన మాక్ పార్లమెంట్ సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్

**దేవరకద్ర నియోజకవర్గం, జనవరి 10 (ప్రజాస్వరం):**

కౌకుంట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, కౌకుంట్ల లో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో కౌకుంట్ల గ్రామ సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ మాట్లాడుతూ,విద్యార్థుల్లో ప్రజాస్వామ్య అవగాహన, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని రేపటి సమాజాన్ని నడిపించే నాయకులు పాఠశాల నుంచే తయారవుతారని. ఈ కార్యక్రమం నిర్వహించిన స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..




## ఉమ్మడి ఖమ్మం జిల్లా పురపాలక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి కేటీఆర్

- ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసిన కేటీఆర్
- మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం లో పాల్గొన్న - మాజీ ఎంపీ నామ

**ఖమ్మం,జనవరి 10 (ప్రజాస్వరం):**



బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ దిశానిర్దేశం మేరకు వచ్చే మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే ప్రక్రియకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే అందులో భాగంగా శనివారం హైదరాబాద్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాల పైన కేటీఆర్ నేతలకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్ రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, చంద్రావతి, హరిప్రియ, మాజీ జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు, మాజీ లైబ్రరీ కమిటీ ఛైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు మంజుల,గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ జిఎఫ్ అండర్ 14 ఖో ఖో తెలంగాణ జట్టుకి జీడిమెట్ల విద్యార్థి ఎంపిక

- తెలంగాణ ఖో-ఖో జట్టులో చోటు దక్కించుకున్న జీడిమెట్ల విద్యార్థి

**కుత్బుల్లాపూర్,జనవరి 10(ప్రజాస్వరం):**

జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీడిమెట్ల నుండి 8వ తరగతి విద్యార్థి ఎస్. అజయ్,తండ్రి పేరు,ఎస్ సురేష్ గత నెలలో 29,30 తేదీలలో సెయింట్ మార్క్స్ హై స్కూల్ తాండూర్ లో స్టేట్ లెవెల్ ఎస్ జిఎఫ్ అండర్ /14 ఖోఖో టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో ఎస్.అజయ్ రంగారెడ్డి టీం జట్టు కి ప్రాతినిధ్యం వహించాడు.ఈ టోర్నమెంట్ లో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలువగా ఆ జట్టు నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీడిమెట్లకు చెందిన అజయ్ తెలంగాణ కోకో అండర్ 14 ఇయర్స్ బాయ్స్ జట్టు కి ఎంపిక కావడం జరిగింది. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ అరుణ జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ జట్టుకి అజయ్ ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని అదేవిధంగా మా విద్యార్థి ఈనెల 16 నుండి 23 వరకు రాజస్థాన్ లో జరిగే నేషనల్ లెవెల్ ఖో ఖో టోర్నమెంట్ లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడని చాలా గర్వంగా ఉందని అన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మరియు ఉపాధ్యాయినీ , ఉపాధ్యాయులు అజయ్ ని అభినందించారు.అజయ్ తల్లిదండ్రులు కూడా ఆ విద్యార్థి ఒక ప్రభుత్వ పాఠశాలలో చదివి తెలంగాణ జట్టు నుండి ప్రతినిత్యం వహించడం ఎంతో సంతోషంగా ఉందని ఇదంతా కూడా ఫిజికల్ డైరెక్టర్ అరుణ జ్యోతి శిక్షణలోనే జరిగిందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
11.01.2026
ఆదివారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com




# దొమ్మాటలో యూరియా కార్డుల పంపిణీ

దౌల్తాబాద్, జనవరి 10 (ప్రజాస్వరం) :

దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ అంజయ్య ఆధ్వర్యంలో రైతులకు యూరియా కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఏఈఓ సంతోష్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంజయ్య రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, పంటలు సమృద్ధిగా పండాలంటే యూరియా ఎంతో అవసరమని తెలిపారు. అత్యవసర సమయాల్లో యూరియా సులభంగా అందుబాటులోకి రావాలంటే యూరియా కార్డు తప్పనిసరిగా ఉపయోగపడుతుందన్నారు. అందుకే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూరియా కార్డు పొందేందుకు వచ్చే రైతులు తమ వెంట భూమి పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్రా రాజేందర్, మల్లేశం, రైతు సోదరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఛలో సూర్యాపేటకు తెలంగాణ ఉద్యమకారుల మహాసభ



దౌల్తాబాద్, జనవరి 10 (ప్రజాస్వరం):

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారెడ్డి బాల్ లక్ష్మీ, మహమ్మద్ సుల్తాన ఉమర్ మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి అని స్పష్టంగా డిమాండ్ చేశారు. శనివారం రాయపోల్, గజ్వేల్ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు సూర్యా పేట మహాసభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు, రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగంతో ఏర్పడిన పరిస్థితులను గుర్తుచేసి, ఉద్యమకారుల జీవితాలు నష్టపోయాయని అన్నారు. ఉద్యమకారులు ప్రభుత్వంపై ప్రత్యేక డిమాండ్లను ప్రకటించారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి. 250 గజాల్లో ఇంటి స్థలంతో పాటు 4 గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలి. నెలకు 30,000 రూపాయల పెన్షన్. మలిదశ ఉద్యమంలో అమరులైన 1,200 మందిలో మిగతా వారికి ఆర్థిక, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. 100 ఎకరాల్లో అమరవీరుల స్మృతివనం. అమరుల కుటుంబాలకు ఈఎస్ఐ సౌకర్యం, ఉచిత బస్సు పాసులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత. కుటుంబాలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో 2% రిజర్వేషన్. కుటుంబాలకు 50% సబ్సిడీతో కోటి రూపాయల వ్యాపార ఆర్థిక సహాయం. రాష్ట్ర సాధనలో కీలకపాత్ర వహించిన కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు, సాంస్కృతిక పాలసీ. అన్ని జిల్లా కేంద్రాలలో అమరవీరుల కోసం స్మారక భవనం నిర్మాణం. ఉద్యమకారులకు 20 లక్షల సామాన్య ప్రమాద బీమా. ఈ మహాసభకు టీయు జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుట్ట రాజు, జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి స్వరూప, కో కన్వీనర్ సుదర్శన్, నాయకులు చిత్తార, సుధాకర్ రెడ్డి, మాణిక్య ప్రభు, భాస్కర్, మన్నే గణేష్, సొక్కం స్వామి, బొల్లం రాజేష్, సుధాకర్, కృష్ణ, ఎల్లమ్మ, లక్ష్మి, అనసూయ, శారద, భాగ్య, భాను ప్రసాద్, భారత్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారులు ప్రభుత్వానికి తమ డిమాండ్లను తక్షణం నెరవేర్చాలని పిలుపునిచ్చారు.





## కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు

# ప్రజాసేవలో ఉంటా

- ప్రజల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలి
- దుర్గామాత సాక్షిగా నియోజకవర్గ ప్రజల కోసం పనిచేస్తా
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు



మెదక్ జనవరి 10 (ప్రజా స్వరం) :

తాను పుట్టిన సొంత గ్రామంలో తన జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఎంతో సంతోషంగా ఉందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం చిన్న శంకరంపేట మండలం కోర్విపల్లి గ్రామంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నియోజవర్గ పరిధిలోని ఆయా మండలాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున వాహనాలు తరలి వచ్చారు. జన్మదిన వేడుకలకు వచ్చిన కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. మెదక్ నియోజకవర్గంలో పాటు మల్కాజిగిరి నియోజకవర్గాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి హనుమంతరావు కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్త తయారు చేసిన భారీ కేకును హనుమంతరావు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కట్ చేశారు. జన్మదిన వేడుకల్లో తెలంగాణ గద్దర్ నర్సన్న మైనంపల్లి హనుమంతరావు పై పాడిన పాట కార్యకర్తలను ఎంతగానో అలరింపజేసింది. పుట్టినరోజు వేడుకలకు వచ్చిన కార్యకర్తలకు భోజన వసతి ఏర్పాటు చేశారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ ప్రజలు తనపై ఉన్న అభిమానంతో పెద్ద ఎత్తున తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎప్పుడు ప్రజాసేవకే అంకితమై పనిచేస్తానని అన్నారు. ప్రజల సమస్యలే తన సమస్యగా భావించి వీలైనంత మేర పరిష్కరిస్తానని హామీలు ఇచ్చారు. మెదక్, సిద్దిపేట, మల్కాజిగిరి నియోజవర్గాల నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరశురాం గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజాస్వరం కథనంతో కదిలిన అధికారులు

ఎట్టకేలకు రామాయపల్లి వంతెన
ప్రారంభించిన జీఎంఆర్ అధికారులు
కథనం ప్రచురితమైన
కొన్ని గంటలలోనే స్పందన
ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్న వైనం




**తూప్రాన్ , జనవరి 10 (ప్రజాస్వరం ) :** మెదక్ జిల్లా మెదక్ జిల్లా మనోర బాద్ మండలం రామాయపల్లి వద్ద వంతెన నిర్మాణం జరిగిన ప్రారంభం ఎప్పుడో అనే శీర్షికతో ప్రజాస్వరంలో ప్రచు రితమైన కథనానికి స్పందనగా శనివారం సాయంత్రం ఐదు గంటలకి జీఎంఆర్ అధికారులు నేషనల్ హైవే అథారిటీ అధికా రుల వంతెన ప్రారంభించారు నిజాంబాద్ నుండి హైదరా బాద్ వెళుతున్న ప్లైయి ఓవర్ వంతెనను ప్రారంభించాడం తో వాహనదారులు ప్రజా స్వరం పత్రిక యాజమాన్యం నికి ప్రతినిధి కి కృతజ్ఞతలు తెలిపారు వంతెన ప్రారంభం తో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు టోల్ రుసుము వసూల్ చేసిన సౌకర్యాలు కలిపించడం లో ఆలసత్వం వహించడం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వంతెన పై నుండి వాహనాలకు అనుమతి ఇస్తూ రాకపోకలకు ఇబ్బంది తొ లిగించిన అధికారులకు ప్రజలు ధన్యవాదములు తెలిపారు.



## ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలి



- మండల వ్యవసాయ అధికారి వసంతరావు

**జగదేవ్ పూర్, జనవరి10 (ప్రజాస్వరం) :** జగదేవ్ పూర్ మండలం తిమ్మాపూర్ మరియు వట్టిపల్లి గ్రామాలలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం లోని రైతులు అందరూ ఈ ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు చేసు కోవాలని సూచించారు. దీని ద్వారా కేంద్ర ప్రభు త్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలు పొంద డానికి ఈ రిజిస్ట్రీ నెంబర్ తప్పని సరి అవుతుం దని తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసుకొని రైతులకు వారి చరవాణి కి మేసేజ్ పంపించటం జరిగిందని కావున మండలంలో ఇప్పటివరకు నమోదు కానీ రైతులు అందరూ తమ సంభందిత వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర కానీ లేదా సమీప మీ సేవ సెంటర్ (రూ .15/ చెల్లించి) కు వెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ పోసానిపల్లి రాజు ఉప సర్పంచ్ అక్కరాజు నాగరాజు, మాజీ సర్పంచ్ తలకొక్కల శ్రీశైలం ,వట్టిపల్లి మాజీ సర్పంచ్ రజిత రాజేందర్ రెడ్డి, రైతులు అక్కరా జు రాజయ్య, వడ్లకొండ మహేష్, కొంతం కృష్ణం రాజు, వీరబత్తిని రామకృష్ణ, పెద్దులు వ్యవసాయ విస్తరణ అధికారులు కిరణ్ మరియు కృష్ణమూర్తి పాల్గొన్నారు.



## ఉప సర్పంచుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడిగా శింగి రాంరెడ్డి

**మనోహరాబాద్, (ప్రజాస్వరం) :** మెదక్ జిల్లా ఉప సర్పంచుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడిగా సింగీ రామ్ రెడ్డి ను ఎన్నుకు న్నట్టు రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరమ్ వ్యవ స్థాపకుడు రాములు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నాడు ఆయన బాధ్యతలు అప్పగిస్తూ ఉత్త్వరులు జారీ చేశారు.ఈ జిల్లా మాజీ ఉప సర్పంచులు ఫోరమ్ రేణు కుమార్,జిలా సీనియర్ నాయకులు సింగి మహిపాల్ రెడ్డి కృషి తో పదవి పొందటం సంతోషంగా ఉందని అన్నారు.వార్డు సభ్యులు సరిత మహిపాల్ రెడ్డి,మహమ్మద్ సలీం,బంటు వెంకటలక్ష్మి నాగరాజు,సాదు, సత్య నారాయణ,కందల జానకి జహంగీర్ బాబు,శిమిడి శ్రీకాంత్,మూల రత్నమాల సిద్ధి రాములు ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.

## పులి సంచారం.. జాగ్రత్తగా ఉండాలి



**మాసాయిపేట (ప్రజాస్వరం) :** ,చెట్ల తిమ్మాయపల్లి అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ బీట్ అధికారి చిరంజీవి తెలిపారు. రెండు, మూడు రోజులుగా చిరుత పులి కనిపిస్తుండడంతో శనివారం గ్రామాల్లో పర్యటించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో పశువులను ఉంచరాదని, రాత్రుల్లో సమీపంలో కి వెళ్లవద్దని, ఒంటరిగా ప్రజలు తిరగరాదని సూచించారు.

# లేబర్ కోడ్స్ సవరణ బిల్లుల రద్దుకై పోరాటం



**తూప్రాన్ , జనవరి 10 (ప్రజా స్వరం) :**
తూప్రాన్ బస్సు స్టాండ్ లో బిల్లులు సవరణ పై పోరు యాత్ర లో భాగంగా శనివారం రోజు కేంద్ర ప్రభుత్వ విధానాలపై జనవరి 8 నుండి 11 వరకు జిల్లా వ్యాప్తంగా పోరు యాత్ర, మెదక్ లో ఈనెల 8న ప్రారంభమైన కార్మిక కర్షక పోరుయాత్ర మనోహరబాద్ మండలం నుండి తూప్రాన్ పట్టణ కేంద్రానికి చేరుకోవడం జరిగింది.

**జనవరి 19 న జిల్లా కేంద్రాల్లో సభలు ,,**

సిఐటియు జిల్లా కోశాధికారి కే. నర్సమ్మ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి. విబి జీ రామ్ జీ చట్టం, జాతీయ విత్తన సవరణ బిల్లు, విద్యుత్ సవరణ బిల్లుల రద్దుకై దేశ వ్యాప్త పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా కోశాధికారి కే. నర్సమ్మ తెలిపారు. సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై జనవరి 8 నుండి 11 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్మిక, కర్షక పోరుయాత్ర కొనసాగుతుందన్నారు.

ఈ సందర్భంగా తూప్రాన్ బస్ స్టాప్ సమీపంలో ఆమె మాట్లాడుతూ పెట్టుబడి దారుల కోసమే కేంద్ర ప్రభుత్వం సంస్కరణలను వేగంగా అమలు చేస్తుందన్నారు.2019లో తీసుకువచ్చిన లేబర్ కొడ్స్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తుందని తెలిపారు.శ్రమ శక్తి నీతి 2025 పేరుతో కార్మికుల ప్రయోజనాలను పెట్టుబడిదారులకు తాకట్టు పెడుతుందని విమర్శించారు.2025 పార్లమెంట్ సమావేశాల్లో విద్యుత్ ఉత్పత్తి రంగంలో ప్రయివేట్ సంస్థలకు అవకాశాలు కల్పిస్తు చట్టం చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు.బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం నిర్ణయం చేసిందని అన్నారు.న్యూక్లియర్ లాయబులిటి బిల్లు ద్వారా తీసుకువచ్చి ప్రజలపై భారలు వేస్తుందని అన్నారు గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు జీవనోపాది కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు మొదలు పెట్టిందని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన వీబీ జి రామ్ జి బిల్లు ఉపాధి కూలీల హక్కులను హరిస్తుంది. ఉపాధికి గ్యారంటీ లేకుండా చేస్తుందని ఆరోపించారు. పథకంలో ఉన్న మహాత్మా గాంధీ పేరును మార్చి జి రామ్ జి పేరుతో బిల్లు తేవడం ఎవ్వరి ప్రయోజనాలకోసమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారం మోపి పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వాలపై నెట్టివేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల దయదక్షిణ్యలపై ఆధారపడి ఉపాధి కూలీలు పని కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.గత 12 ఏండ్లుగా ఉపాధి హామీ పథకానికి నిధుల కోత విధిస్తుందని అన్నారు. కొత్త పథకం గ్రామీణ ప్రాంతంలో డిమాండ్ అదారిత హక్కుగా కాకుండా ప్రభుత్వం బడ్జెట్, నోటిఫికేషన్స్, టెక్నాలజీ లాంటి ఆంక్షలపై ఆధారపడుతుందని అన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ఉపాధి హామీ చట్టభద్ధమైన హక్కుగా ఉందని, కొత్త చట్టం వలన పరిపాలన నిర్వహణ అదారిత విధానంగా మారుతుందని తెలిపారు.దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కూలీలకు సగటున కల్పిస్తున్న పని దినాలు 51.6 రోజుల కంటే ఎక్కువ లేవనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. 100 రోజులు పని దినాలు పూర్తి చేసిన కుటుంబాలు 11 శాతనికి మించి లేవన్నారు.కొత్త చట్టం ప్రకారం ఉపాధి హామీ పథకం దేశవ్యాప్తంగా అమలు కాదని కేంద్ర ప్రభుత్వం నోటిఫైడ్ చేసిన ప్రాంతాలకే పరిమితం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వలన గ్రామీణ ప్రాంతంలోని వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, ఆదివాసులు, పెదప్రజలు నష్టపోతారని అన్నారు.కేంద్రం తెచ్చిన నూతన చట్టం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు.నరేగా లో ఉన్నఉపాధి హామీ హక్కు అదారిత స్వభావన్నీ యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ సంస్థల్లో మతోన్మాద భావజాలన్నీ జోప్పిస్తుందని అన్నారు. రాజ్యాంగ బద్ద సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకుంటుందని అన్నారు. మతం ఆదారిత పరిపాలన చేయడం రాజ్యాంగ స్ఫూర్తి కి విరుద్దామని తెలిపారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలపై దాడి చేస్తుందని అన్నారు. లౌకిక దేశాన్ని హిందుత్వ అదారిత దేశంగా మార్చి పరిపాలన చేయాలని కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పెట్టుబడి దారులకుకరు చౌకగా అమ్మివేస్తుందని అన్నారు. ప్రజల సంపదను ఆధాని, అంబానిలకు కట్టాబేడుతుందని అన్నారు. దేశ ప్రజల ప్రయోజనాల కంటే పెట్టుబడి దారుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వసంస్థల్లోఅమలుఅవుతున్న రిజర్వేషన్స్ రద్దుచేయడానికికుట్రలుచేస్తుందనిఅన్నారు. కేంద్రం ప్రభుత్వసంస్థల్లో అమలు అవుతున్న సౌకర్యాలు తొలగించాడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి మాట్లాడుతు మెదక్ జిల్లా వ్యాప్తంగా 21 మండలాలలో జాతను ప్రచారం చేసుకుంటూ తిరుగుతుందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించండి అని అన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా జనవరి 8 నుండి 11 వరకు జీపు జాతాలు అన్ని మండలాలకు ప్రచారం చేసుకుంటూ వెళుతుందని అన్నారు. గత 11 సం॥రాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలారాయడమే కాక, రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసింది. ఒక వైపున ప్రజాసంక్షేమం వల్లిస్తూనే 11సం॥రాల పాలనలో కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ వంటి బడాపెట్టుబడి దారులకు కట్టబెడుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై జనవరి 19 న జిల్లా కేంద్రంలో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా జరిగే ఆందోళనల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు భాగస్వాములు కావాలని కోరుతున్నామనీ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం మాట్లాడుతూ... వామపక్షాల పోరాటం ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం రూపొందింది దీని ప్రకారం వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 100 రోజులు పని కల్పించాలి ప్రస్తుతం రోజుకి 307 రూపాయలు ఇవ్వాలి కానీ దేశంలో మొత్తం వ్యాయంలో 90% కేంద్రం 10 శాతం రాష్ట్రాలు భరించాలి ఈ చట్టం ద్వారా కరువుల్లో కరోనా సందర్భంగా గ్రామీణ ప్రజలకు ఉపాధి దొరికింది. కానీ ఈ పథకాన్నికి ఏటా 2.5 లక్షల కోట్లు కేటాయించాలని ఆందోళన జరుగుతుండగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని మార్చి ఎత్తివేయడానికి ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. రక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ, మున్సిపల్ ,విద్యుత్ ఇతర రంగాల నాయకులు బాబు,సురేష్,కృష్ణ, భాగమ్మ,పునమ్మ, స్వరూప, పోచమ్మ,శాంతమ్మ,ఎల్లం, స్వామి, దాశరథ,మలేష్,నాగరాజు. హనుమంత్, వెంకటేష్, సునీల్, శేఖర్, నరేందర్, అసిఫ్,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## కిష్టారెడ్డిపేట్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

- **కాటా శ్రీనివాస్ గౌడ్‌కు అఖిలపక్ష నేతల విజ్ఞప్తి**

**అమీన్‌పూర్, జనవరి10 (ప్రజా స్వరం) :**
పటాన్‌చెరువు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్‌ను అమీన్‌పూర్ మండల అఖిలపక్ష నాయకులు కలిసి, కిష్టారెడ్డిపేట్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. అఖిలపక్ష ప్రతినిధులతో సమావేశమైన కాటా శ్రీనివాస్ మాట్లాడుతూ, కిష్టారెడ్డిపేట్ డివిజన్ ఏర్పాటు విషయమై జిల్లా మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహతో మాట్లాడి ముందడుగు వేయించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మండల అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన



- **గుమ్మడిదలలో పరిశీలన**

**గుమ్మడిదల, జనవరి10 (ప్రజా స్వరం) :**
గుమ్మడిదల మండలంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి కే. శివప్రసాద్ ఈ రోజు పరిశీలించారు. వ్యవసాయ అధికారులు మరియు రైతులతో మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతీ రైతు కేంద్ర ప్రభుత్వం పథకాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఇందుకోసం భూమి ఉన్న ప్రతీ రైతు తమ ఆధార్, లింక్ ఉన్న మొబైల్‌తో గ్రామంలోని ఏ ఈ ఓ లేదా మీసేవ కేంద్రాన్ని సంప్రదించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతీ రోజు ఒక్కో గ్రామంలో రైతులకు రిజిస్ట్రేషన్ చేయాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గుమ్మడిదల రైతు వేదిక మరియు నల్లవల్లి గ్రామాల్లో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏ.ఓ. డీ. శ్రీనివాసరావు, ఏ.ఈ.ఓ. జీ. నిఖిత, ఆర్. ఆస్మిత మరియు రైతులు పాల్గొన్నారు.

## ఆలయాలను కాపాడుకుందాం




- **వర్గల్ శంభుగిరి ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు**

**గజ్వేల్, వర్గల్ జనవరి 10 (ప్రజాస్వరం) :**
1026 జనవరిలో గజినీ మమ్మద్ అమర్నాథ్ సోమనాథ్ ఆలయంపై దాడి చేయాగా ఆ యొక్క ఆలయాన్ని పునరుద్ధరించబడి వెయ్యి సంవత్సరాలు నుండి పూజలు అందుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మరియు జిల్లా పార్టీ పిలుపు మేరకు వర్గల్ మండలంలోని శివాలయంలో ఓంకార మంత్రాన్ని పటించి, అభిషేకం అర్చనలు పూజలు హారతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, సీతారాంపల్లి సర్పంచ్ రామాంజనేయులు, బూత్ అధ్యక్షులు బద్రినాథ్, సుధాకర్ రెడ్డి, రేణుదాస్, నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష పుష్పార్చన





**శివంపేట / మనోహరాబాద్ (ప్రజాస్వరం) :**
**శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం సికింద్లాపురం లో ధనుర్మాసంపురస్కరించుకొని దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి వారికి లక్ష పుష్పార్చన స్వామి వారి విశేష పూజలు నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమం లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శశిధర్ మరియు ఆలయ అర్చకులు భక్తులు పాల్గొనడం జరిగింది.**

## సైన్స్ ఫెయిర్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన గీత స్కూల్ విద్యార్థిని



**తూప్రాన్ జనవరి 10 (ప్రజాస్వరం) :**
మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణానికి చెందిన గీత స్కూల్ 9వ తరగతి విద్యార్థిని మహతి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం గెలుచుకొని జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వర్ తెలిపారు ఎంపిక పట్ల విద్యార్థి మహా తిని అభినందించారు కరీంనగర్ లో జరిగిన కల్చర్ ప్రోగ్రాం కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ అంజి రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు గీత స్కూల్లో విద్యార్థులను ఏ రంగంలోనైతే ప్రతిభ కనబరుస్తారో ఆ రంగంలో వారిని తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయ బృందం వారిని ప్రోత్సహిస్తుంది అని పాఠశాల డైరెక్టర్ రామాంజనేయులు ఉష లు తెలిపారు

## బంగారమ్మ ఆలయంలో మైనంపల్లి పూజలు






**తూప్రాన్ , జనవరి 10 (ప్రజాస్వరం) :**
మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నాయకులుమైనంపల్లి హనుమంతరావు జన్మదిన సందర్భంగా కాళ్ళకాల్ బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కాళ్ళకల్ సర్పంచ్ నవ్య నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు .అక్కడి నుండి 100 కార్లతో భారీ ర్యాలీగా మెదక్ లో జరిగే జన్మదిన వేడుకలకు బయలుదేరారు .ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి తనయుడు రోహిత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మైపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ,జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు ఆవుల గోపాల్ రెడ్డి ,నక్క ప్రభాకర్ ,మాజీ ఎంపీపీ గడ్డం స్వప్న వెంకటేష్ ,ఘనపూర్ సర్పంచ్ ,సబ్బానీ వెంకటేష్ ,కార్మిక నాయకులు నాగభూషణం ,వివిధ గ్రామాల సర్పంచ్ లు ,కౌన్సిలర్ లు ,కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ పోటీలు ప్రారంభం



- **ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా**

**రామాయంపేట, జనవరి 10( ప్రజాస్వరం)**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో శనివారం కాట్రియాల ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ పోటీలను స్థానిక సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా విన్నర్ కప్ ఆవిష్కరణ చేసిన అనంతరం క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీర దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతిరోజు క్రీడలు ఆడాలని యువతకు సూచించారు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త రాజేందర్ గుప్తా, మాజీ సర్పంచ్ శ్యామ్ తదితరు పాల్గొన్నారు.



# సర్పంచ్‌కు అభినందన వెలువ

- **గెలిచి నెల రోజులకే గ్రామంలోని సమస్యలకు చెక్**

**గజ్వేల్/వర్గల్ జనవరి 10 (ప్రజాస్వరం):**

వర్గల్ మండలం మల్లరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ గా గెలిచి నెల రోజుల వ్యవధిలోనే గ్రామంలో ఉన్న యువత కి క్రికెట్ కిట్ అందజేశారు. గ్రామంలో ఉన్న అండర్రౌండ్ డ్రైనేజి సమస్య తొలగించారు. గ్రామనికి దొంగతనాలకు తావు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.వీధిదీపాల సమస్య ఉందని వర్గల్ నుంచి శాఖరం వరకు వేయించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలను డోజర్ సహాయం తో తొలగించారు. మండలంలోనే మల్లారెడ్డిపల్లి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామం, ఆదర్శ గ్రామం వైపు తనదైన శైలిలో పలు కార్యక్రమాలు చేపడుతు నిత్యం ప్రజల్లో తిరుగుతూ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న మల్లారెడ్డిపల్లి సర్పంచ్ దాసరి యాదగిరి విజయలక్ష్మి గార్లకు గ్రామస్తులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

# శిశు మందిర్ పాఠశాలలు నిరంతర శిక్షణా కేంద్రాలు





**ఆదిలాబాద్ జిల్లా జనవరి 10 (ప్రజాస్వరం) :**

పూర్వ ప్రాధానాచార్యులు ఒరగంటి ఇస్తారి శిశు మందిర్ పాఠశాలలు నిరంతర శిక్షణా కేంద్రాలుగా ఉండి నైపుణ్యాలు గల ఉపాధ్యాయులను తయారు చేస్తూ అత్యుత్తమ ప్రతిభ గల విద్యార్థులను దేశానికి అందించుటలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఒరగంటి ఇస్తారి గారు అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రము లోని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఇచ్చోడ,బజార్ హత్నూర్, నేరేడిగొండ, గుడిహత్నూర్,బోథ్ శిశు మందిర్ పాఠశాలల ఆచార్యులకు నిరంతర శిక్షణ వర్గలలో భాగంగా మాసవ ర్గ నిర్వహించారు. పాఠశాల అధ్యక్షులు ప్రభుత్వ ఉపాధ్యాయులు దేవర్ల సంతోష్ కమ్యూనికేషన్ ఇంగ్లీష్ లో మెళకువలు గురించి క్లాస్ తీసుకున్నారు.వివిధ విషయాలు ఇంగ్లీష్, సైన్స్,తెలుగు,సదాచారం,శారీరక శిక్షణ లో ఎలా బోధించాలో విషయ నిపుణులు తరగతులు నిర్వహించారు.ఈ మాసవర్గ లో ప్రైమరీ,ప్రీ ప్రైమరీ తరగతుల ఆచార్యులకు శిక్షణ ఇవ్వడం జరిగింది.పాఠశాల కమిటీ సభ్యులు రాజేందర్, సుదర్శన్, సంతోష్,శేఖర్ ప్రధానాచార్యులు సంతోష్ కుమార్,వెంకట రమణ,మీన,రమాదేవి పాల్గొన్నారు.






# యువతకు ప్రేరణగా మాజీ సర్పంచ్ మల్లేష్

**దౌల్తాబాద్, జనవరి 10 (ప్రజాస్వరం) :**

మహమ్మద్ షాపూర్ గ్రామ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన మాజీ సర్పంచ్ దమ్మన్నగారి మల్లేష్ యాదవ్ మరోసారి గ్రామ యువత హృదయాలను గెలుచుకున్నారు. యువత క్రీడల్లో రాణించి, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలనే లక్ష్యంతో ఆయన గ్రామ యువకులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా డ్రగ్స్, బెట్టింగ్, మద్యం, పేకాట వంటి సామాజిక దుష్ప్రవర్తనలను త్యజించాలని సూచించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణను పెంపొందించడమే కాకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతాయని అన్నారు. చదువు, క్రీడలపై దృష్టిసారించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని యువతకు హితవు పలికారు. గ్రామ ఉపసర్పంచ్ బాబు మాట్లాడుతూ, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని, అలా చేసినప్పుడే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు.

## ఘనంగా మైనంపల్లి జన్మదిన వేడుకలు



**చిన్న శంకరంపేట, జనవరి 10 ( ప్రజాస్వరం) :**

జన్మించిన గ్రామంలోనే జన్మదిన వేడుకలు జరుపుకున్న మహానుభావుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మెదక్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు, మెదక్ జిల్లా సరిహద్దు ప్రాంతం నుండి ఆయనకు అభిమానులు కార్యకర్తలు భారీ కాన్వాయి తో ఘన స్వాగతం పలికారు, చిన్న శంకరంపేట మండలం గవలపల్లిలో నాయకులు అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు, అనంతరం కొరివిపల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు, జన్మదిన వేడుకలు అంబరాన్ని అంటే విధంగా సంబరాలు నిర్వహించారు, నియోజకవర్గంలో నుండే కాకుండా ఇతర నియోజకవర్గాల నుండి అభిమానులు వేల సంఖ్యలో తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, వేదికపై సర్వమత ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వాదాలు అందచేసే కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు నియోజకవర్గం నుండి కాకుండా ఇతర నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్, స్థానిక కొరవి పల్లి సర్పంచ్ పుల్లారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ జెడ్పిటిసి పోతరాజు రమణ, సరాఫ్ యాదగిరి, మాజీ ఎంపీపీలు పండరి గౌడ్, అరుణ ప్రభాకర్, టి పి సి సి రాష్ట్ర నాయకుడు చౌదరి సుప్రభాత రావు రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, డిసిసి నాయకులు శ్రీమాన్ రెడ్డి, సానా సత్యనారాయణ, రాజిరెడ్డి,గజవాడ నాగరాజు, అమర్ సేనారెడ్డి, తోట లింగమూర్తి, చిరంజీవి, రాజశేఖర్ రెడ్డి, రాజాసింగ్, మహేందర్ సింగ్, రాజ్ కుమార్ గౌడ్, అవుసుల రవీందర్, అక్బర్, ఆకుల నవీన్ కుమార్, తోపాడు వివిధ గ్రామాల సర్పంచులు మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు,

# గాజులపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**దౌల్తాబాద్, జనవరి 10 (ప్రజాస్వరం):**

మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి శ్రీవాణి తండ్రి బుచ్చిరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును స్థానిక సర్పంచ్ పంజా స్వామి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పంజా స్వామి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసాగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందజేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్, పూసపల్లి కుమార్, పాశం బాలరాజు, పోతుగంటి మల్లారెడ్డి, బాసం గారి రవి, గొల్లపల్లి రాజు, బొల్లి లింగయ్య, కున్యాల మల్లారెడ్డి, పోతుగంటి నాగిరెడ్డి, బోయిన్ పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం

- **నూతన సర్పంచ్ అనురాధ రమేష్, ఉప సర్పంచ్ బాలకృష్ణకు మున్నూరు కాపు సంఘం సన్మానం**

**దౌల్తాబాద్, జనవరి10(ప్రజాస్వరం) :**

మండల కేంద్రంలోని దౌల్తాబాద్ పట్టణంలో కొలువై ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి 11వ వార్షికోత్సవాన్ని కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్, ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణలను మున్నూరు కాపు సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రజల ఆశీస్సులతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆది వెంకటేశ్వర్లు, ఆది శివరాములు, ఆది పెద్ద వెంకన్న, ఆది రామకృష్ణయ్య, ఆది సత్యనారాయణ, నాగభైరవ రెడ్డి, ముచ్చమర్రి శ్రీనివాస్, కృష్ణ, బుడ్డ రమేష్, ఆది మహేష్, ఆది నర్సింలు, బుడ్డ రాజు, ఆది బాల్ రెడ్డి, ఆది ప్రతాప్, ఆది శ్రీనివాస్, ఆది రంగన్న, ఆది శ్రీధర్, ఆది రాము, ఆది మనింద్ర తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999